సాక్షి సంగారెడ్డి

ఆదివారం, 12, ఫిబ్రవరి, 2023



శాస్త్రీయ విద్యపై చిన్న చూపు

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు శాస్త్రీయ విద్యకు దూరమవుతున్నారు. సైన్స్ ల్యాబ్ పరికరాలు, సామగ్రిని విద్యాశాఖ అందివ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. 8లో



బైక్‌ను ఢీకొట్టిన లారీ

బైక్‌పై వెళ్తున్న దంపతులను వెనుక నుంచి వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. 8లో



రహదారుల అభివృద్ధికి చర్యలు

మారుమూల గ్రామాల్లోని రహదారులను అభివృద్ధి చేసేలా ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందని పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. 9లో

న్యూస్‌రీల్

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



మొక్కలు నాటుతున్న అధికారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల ప్రభుత్వ మోడల్ పాఠశాల ఆవరణలో చెన్నై సత్సంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిని, నీటిని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. భవిష్యత్ తరాల వారికి మంచి వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రభుత్వం హరితహారం కార్యక్రమంలో భాగంగా కోట్లాది మొక్కలను నాటించిందని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంప్రసాద్ మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో 1000 మొక్కలు నాటినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు సర్వే



సర్వే చేస్తున్న సర్వేయర్లు

నారాయణఖేడ్: నిజాంపేట్ – నారాయణఖేడ్ – బీదర్ 161బీ జాతీయ రహదారి సర్వే నిర్వహిస్తున్నారు. ఈ జాతీయరహదారిని రెండు వరుసలుగా విస్తరించేందుకు రూ.513కోట్లు మంజూరు అయ్యాయి. త్వరలో విస్తరణ పనులు ప్రారంభం కానున్నాయి. ఇదివరకే పలుమార్లు సర్వే చేశారు. ప్రస్తుతం మరోసారి సర్వే చేపట్టారు. నిజాంపేట్ వైపు నుంచి సర్వే ప్రారంభమైంది. జీకేఈ సంస్థ సర్వేయర్లు కిరోధర్ మర్బో, సుశీల్ మార్బో సిబ్బందితో కలిసి సర్వే నిర్వహిస్తున్నారు. వారం రోజుల్లో సర్వే పూర్తవుతుందని సర్వేయర్లు తెలిపారు.

సింగూర్ నుంచి నీటి విడుదల

కొల్చారం(నర్సాపూర్): ఘనపురం వనదుర్గా ప్రాజెక్ట్ కింద ఉన్న ఆయకట్టుకు సింగూర్ ప్రాజెక్టు నుంచి శనివారం రెండో విడత నీటిని విడుదల చేసినట్లు కొల్చారం తహసీల్దార్ చంద్రశేఖర రావు తెలిపారు. ప్రాజెక్టు నుంచి మొత్తం 150 ఎంసీఎఫ్‌టీల నీటిని విడుదల చేసినట్లు ఆయన పేర్కొన్నారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటుందని, మండలంలోని మంజీరా పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

పాపన్నపేట (మెదక్): క్రీడలు మానసిక ఉల్లాసానికి, దేహ దారుఢ్యానికి దోహదపడతాయని ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఆరెపల్లిలో దొడ్ల నరేందర్‌రావు, వట్‌పల్లి రజనీకాంత్ స్మారకార్థం నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత దేశ క్రీడగా సుపరిచితమైన కబడ్డీ ఆట ప్రో కబడ్డీతో అంతర్జాతీయ స్థాయిలో ప్రాచుర్యం పొందిందన్నారు. టీఎస్పీఎస్సీ మెంబర్ సుమిత్ర మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులకు పోటీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీపీ చందన మాట్లాడుతూ యువత కంప్యూటర్ ఆటలకు పరిమితమై, మైదాన ఆటలను మరిచిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్ శ్రీనాథ్ మాట్లాడుతూ ఆటలతో యువత జాతీయ స్థాయిలో పేరు సాధించవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఏడుపాయల చైర్మన్, బాలాగౌడ్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ వెంకటరామిరెడ్డి, యూసుఫ్ పేట సర్పంచ్ దాసు, ఎంపీటీసీ జ్యోతి, సీఐ విజయ్, ఎస్ఐ విజయ నారాయణ, పీఈటీలు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

28 రోజులు.. 23 గ్రామాలు

వైభవంగా ముగిసిన పాత పంటల జాతర

- ఆకట్టుకున్న బండ్ల ఊరేగింపు
- హాజరైన అదనపు కలెక్టర్, ప్రముఖులు



మాచ్నూర్‌లో ఎడ్లబండ్ల ఊరేగింపులో మహిళా రైతులు

ఝరాసంగం(జహీరాబాద్): డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పాత పంటల జాతరకు జనం నీరాజనం పలికారు. జిల్లాలో జనవరి 14న ప్రారంభమైన 23వ పాత పంటల జాతర నిర్విరామంగా 23 గ్రామాల మీదుగా 28 రోజుల పాటు కొనసాగి శనివారం ఝరాసంగం మండల పరిధిలోని మాచ్నూర్‌లో ముగిసింది. ఈ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ వీరారెడ్డి, చండీగఢ్ రాష్ట్ర ఫుడ్, ట్రేడ్ పాలసీ ఎనలిస్ట్ దేవీందర్ శర్మ, పలువురు ప్రముఖులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవటం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. జహీరాబాద్ ప్రాంతంలో సాగు చేస్తున్న చిరుధాన్యాలతో ఉమ్మడి మెదక్ జిల్లాకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. నేటి సమాజం శక్తి లేని ఆహారం తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. పాత పంటలు భవిష్యత్ తరాలకు ఆదర్శం అన్నారు.

◆ డీడీఎస్ డైరెక్టర్ సతీశ్ మాట్లాడుతూ ఇక్కడి మహిళా రైతులు సాగు చేస్తున్న కలిపి పంటలతో ఆరోగ్యంతో పాటు భూములు బలంగా ఉన్నాయని తెలిపారు. రెండు, మూడు ఎకరాలు ఉన్న రైతులు 25 నుంచి 30 రకాల పంటలను సాగు చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా డీడీఎస్ పాత పంటల జాతర గురించి, వివిధ పండుగలను వివరిస్తూ రచించిన ట్రెడిషనల్ ఫోక్ మీడియా ఇన్ ఇండియా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్, గ్రామ్య రిసోర్స్ సెంటర్ ఫర్ ఉమెన్ రుక్మిణిరావు, సర్పంచ్ రాజు, శాస్త్రవేత్తలు, ప్రముఖులు సత్యనారాయణరాజు, అఖిలేశ్వరి, షేక్ అన్వర్, రత్నావతి, అర్చన పట్నాయక్, నిర్వాహకులు మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మహిళా రైతులు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

ఆకట్టుకున్న స్టాళ్లు

సేంద్రియ సాగు విధానం.. ప్రాధాన్యంపై ఏర్పాటు స్టాళ్లు ఏర్పాటు చేశారు. మహిళా రైతులు పాత పంటలు పండించే విధానం, పొలాల వద్ద నిర్వహించే పండుగలు, పూజా కార్యక్రమాలను వివరిస్తూ ఏర్పాటు చేసిన స్టాళ్లు అందరినీ ఆకట్టుకున్నాయి.

జీవ వైవిధ్య సంరక్షకులకు సన్మానం



పాత పంటలను పండిస్తూ జీవవైవిధ్యాన్ని కాపాడుతున్న సంరక్షకులను సన్మానించారు. మహిళా రైతులు చెరక్‌పల్లి పుణ్యమ్మ, కమిలీ బాయి, సునితలకు సర్టిఫికెట్లు అందజేసి సన్మానించారు. అదేవిధంగా తెలంగాణలో ఉత్తమ సేంద్రియ విధానంలో బెల్లం తయారు చేసిన నర్సింలు, జాతరను స్ఫూర్తిదాయకంగా నిర్వహించిన జాతర లీడర్లు చుక్కమ్మ, వినయ్‌లను ఘనంగా సన్మానించారు.

అలాగే చిరుధాన్యాలు, ఆకుకూరలపై ఏర్పాటు చేసిన స్టాళ్ల వద్ద పాత పంటల సాగుపై మహిళా రైతులు అవగాహన కల్పించారు.

బండ్ల ఊరేగింపు.. నృత్యాలు

పాత పంటల జాతర ముగింపు సందర్భంగా మాచ్నూర్ గ్రామం నుంచి ప్రధాన రహదారి మీదుగా డీడీఎస్ కేంద్రం వరకు చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తూ ఎడ్లబండ్లతో ఊరేగింపుగా నిర్వహించారు. డప్పు చప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ కోలాటాలు వేస్తూ అందరినీ ఆకట్టుకున్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్



మాట్లాడుతున్న మల్లికార్జున్

పటాన్‌చెరు టౌన్: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల కనీస వేతనాన్ని పెంచాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. శనివారం పటాన్‌చెరు పట్టణంలోని శ్రామికభవన్‌లో నిర్వహించిన సీఐటీయూ ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ దివాలాకోరు విధానాలతో గ్యాస్, పెట్రోల్, డీజిల్, ఉప్పు, పప్పు, బియ్యం నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయన్నారు. అనంతరం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం మాట్లాడుతూ పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలో యాజమాన్యాలు కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్నాయని, కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్, సెలవులు ఇవ్వకుండా శ్రమదోపిడీకి పాల్పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సింహారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పాండురంగారెడ్డి, సీఐటీయూ నాయకులు వీఎస్ రాజు, తిరుపతి, జయకుమార్, సుధాకర్, వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

'ఆసరా'పై అధికారుల అలసత్వం

వెల్దుర్తి(తూప్రాన్): వృద్ధులకు భరోసా అందించేందుకు ప్రభుత్వం ప్రతీనెలా అందిస్తున్న ఆసరా పెన్షన్‌లో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. లబ్ధిదారులు మరణిస్తే పెన్షన్ రద్దుకు సంబంధించిన ప్రక్రియను పూర్తిచేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో పథకం పక్కదారి పడుతోంది. వివరాల్లోకి వెళితే.. వెల్దుర్తి మండలం కుకునూర్ గ్రామానికి చెందిన కూచని నర్సింలు(నర్సయ్య) ఏప్రిల్ 2021 కరోనా సమయంలో గాంధీ ఆస్పత్రిలో మృతిచెందాడు. నర్సింలు బ్యాంక్ అకౌంట్‌లో ప్రతీనెలా రూ.2,016 చొప్పున డిసెంబర్ 2022 వరకు ప్రతీ నెలా పెన్షన్ డబ్బులు జమయ్యాయి. మరణించిన వ్యక్తి పేరును జాబితా నుంచి తొలగించకపోవడం అధికారుల పనితీరును స్పష్టం చేస్తోంది. మండల, డీఆర్‌డీఏ అధికారుల నిర్లక్ష్యంతోనే ఆసరా పెన్షన్ పక్కదారి పడుతున్నాయని ఆరోపణలున్నాయి. ఈ విషయమై ఎంపీడీఓ వెంకటలక్ష్మమ్మను వివరణ కోరగా.. తాను ఇటీవలే డిప్యూటేషన్‌పై వచ్చానని, విచారించి మృతుడి వివరాలను సేకరించి, జాబితా నుంచి పేరును తొలగిస్తామన్నారు. సదరు ఖాతాలో జమైన డబ్బులను రికవరీ చేస్తామని తెలిపారు.

'తొమ్మిదేళ్లలో బీఆర్‌ఎస్ చేసిందేమీ లేదు'

మెదక్‌జోన్: తొమ్మిదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసింది ఏమీ లేదని, మోసపూరిత హామీలతో ప్రజలను మోసగిస్తోందని బీజేపీ రాష్ట్ర నాయకుడు తాళ్లపల్లి రాజశేఖర్ ఆరోపించారు. శనివారం పట్టణంలోని చమాన్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన బీజేపీ కార్నర్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. రైతులకు పంట రుణాల కింద రూ.18 వేల కోట్లు అందించాల్సి ఉండగా, సీఎం కేసీఆర్ మాత్రం బడ్జెట్‌లో కేవలం రూ.6 వేల కోట్లు కేటాయించడం దారుణమన్నారు. రాష్ట్ర నిధులన్నీ సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్ మాత్రమే కేటాయిస్తున్నారని, మిగతా జిల్లాలను పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. మెదక్ పట్టణంలో పిట్లంచెరువు, గోసముద్రం చెరువులను మినీ ట్యాంకు బండ్‌గా, చిల్డ్రన్‌పార్కు, మెదక్ రింగ్‌రోడ్డు, ఏడుపాయలకు రూ.100 కోట్ల నిధులు, చర్చి ఖిల్లా, పోచారం అభయారణ్యాలను పర్యాటక కేంద్రంగా మార్చే హామీలన్నీ నెరవేరలేదని స్పష్టం చేశారు.

దొరల భూములకే ధరణి పోర్టల్

మాజీ ఎమ్మెల్సీ దిలీప్‌కుమార్



మాట్లాడుతున్న దిలీప్‌కుమార్

మెదక్‌జోన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ధరణి పోర్టల్ దొరల భూముల కోసమేనని మాజీ ఎమ్మెల్సీ దిలీప్‌కుమార్ ఆరోపించారు. 2023–24 కేంద్ర బడ్జెట్‌పై శనివారం మెదక్ పట్టణంలోని టీఎన్‌జీఓ భవన్‌లో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రైతుబంధు పథకం భూస్వాములకు లబ్ధిచేకూర్చేలా ఉందని, సామాన్య రైతులకు దానితో ఎలాంటి లాభం లేదని అన్నారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని రూ.5లక్షల కోట్ల అప్పులు చేసి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని వాపోయారు. కరోనా సమయంలో రూ.260కోట్లు ఖర్చుచేసి, అందరికి వ్యాక్సిన్ అందజేసిన ఘనత బీజేపీదేనని అన్నారు. పేదలకు నెలనెలా పంపిణీ చేసే రేషన్ బియ్యం ధరలో కేంద్ర ప్రభుత్వం రూ.30లు భరిస్తుండగా, రాష్ట్రం కేవలం రూ.2లు మాత్రమే అందిస్తూ, ఉచితంగా ఇస్తున్నట్లు ప్రచారం చేసుకుంటుందని మండిపడ్డారు. అనంతరం బీజేపీ రాష్ట్ర నాయకుడు, హైకోర్టు న్యాయవాది రాజశేఖర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మొత్తం అంకెల గారడి తప్ప.. అసలు ఏమాత్రం నిజం లేదన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి ఫసల్‌బీమా యోజన పథకాన్ని అమలు చేస్తుంటే, మన రాష్ట్రంలో మాత్రం ఎందుకు అమలు చేయడం లేదన్నారు. ఈ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేస్తే ఏదైనా విపత్తు ఏర్పడి పంటలు దెబ్బతింటే అన్నదాతలకు నష్టపరిహారం వస్తుందని అన్నారు. అలాంటి మంచి పథకాన్ని కేసీఆర్ ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు నాయిని ప్రసాద్, నాయకులు శ్రీపాల్, మల్కాజి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రియ విద్యాలయ పనుల పరిశీలన



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని మాచ్నూర్ గ్రామ శివారులో నిర్మిస్తున్న కేంద్రియ విద్యాలయం నిర్మాణ పనులను శనివారం అదనపు కలెక్టర్ వీరారెడ్డి పరిశీలించారు. పనుల వివరాలు, ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు? తదితర అంశాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు 30 ఏళ్లుగా ఇక్కడ డీడీఎస్ సహకారంతో వివిధ రకాల ఔషధ మొక్కలను పెంచామని, ప్రస్తుతం కేంద్రియ విద్యాలయం నిర్మిస్తున్నారన్నారు. తమకు ఔషధ మొక్కలు పెంచుకునేందుకు ప్రత్యామ్నాయంగా భూమి చూపించాలని అదనపు కలెక్టర్‌ను కోరారు. ఉన్నతాధికారులతో మాట్లాడి ఎక్కడైనా ఉంటే భూమి కేటాయించేందుకు కృషి చేస్తానని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. నిర్మాణ పనులను అడ్డుకోవద్దని, గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజు, మాజీ సర్పంచ్ ముల్తాని తదితరులు ఉన్నారు.

రాజీమార్గంతో ఇరువర్గాలకు న్యాయం

- లోక్ అదాలత్‌లో 847 కేసులు పరిష్కారం
- జిల్లా జడ్జి శశిధర్ రెడ్డి



రాజీ కుదుర్చుతున్న అధికారులు

సంగారెడ్డి టౌన్: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఉత్తర్వులు, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాద్ ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ శశిధర్ రెడ్డి అధ్యక్షతన శనివారం జిల్లా కోర్టులో లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజీమార్గం ద్వారా కేసును పరిష్కరించుకుంటే ఇరు వర్గాల వారికి ప్రయోజనం ఉంటుందన్నారు. లోక్ అదాలత్‌లో ఇచ్చే తీర్పు అంతిమ తీర్పు అని పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో క్రిమినల్ కాంపౌండ్, ఎంవీటీపీ, సివిల్, బ్యాంక్ రికవరీ, టెలిఫోన్, తదితర కేసులను పరిష్కరించారు. సింగూరు ప్రాజెక్టు భూ నిర్వాసితులకు రావాల్సిన నష్టపరిహారం రూ.5.60 కోట్లను ప్రభుత్వం నుంచి ఇప్పించేందుకు న్యాయవాది నర్సింగరావు కృషి చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 847 కేసులు పరిష్కారమయాయని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం ఎనిమిది బెంచీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి హనుమంతరావు, సీనియర్ సివిల్ జడ్జి రాధాకృష్ణ చౌహన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ లక్ష్మణచారి, బార్ ప్రెసిడెంట్ విష్ణువర్ధన్ రెడ్డి, న్యాయవాదులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజనెల్లిలో మెగా వాలీబాల్ టోర్నీ



వాలీబాల్ టోర్నీని ప్రారంభిస్తున్న ఎస్సై సురేశ్

కోహీర్(జహీరాబాద్): మండలంలోని రాజనెల్లి గ్రామంలో శనివారం మధ్యాహ్నం 11వ అంతర్ రాష్ట్ర మెగా వాలీబాల్ టోర్నీ ప్రారంభమైంది. ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టోర్నీని ఎస్సై సురేశ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. టోర్నీలో బెంగుళూరు, ముంబాయి, పూనే, జాల్నా, రైల్వే, సర్వీసెస్ హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్టణ జట్లు పాల్గొన్నాయి. మొత్తం 14 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకుడు మ్యాతరి ఆనంద్ తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహించే టోర్నీలో విజేత జట్టుకు రూ.52వేలు నగదు, కప్పు, రన్నర్ జట్టుకు రూ.32 వేలు నగదు, కప్పు బహుకరిస్తామని తెలిపారు. మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.11 వేలు, కప్పు, టోర్నీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారుడికి బెస్ట్ ప్లేయర్ అవార్డు కింద రూ.1,100తో పాటు కప్పు అందచేస్తామని తెలిపారు. టోర్నీలో పాల్గొనే క్రీడాకారులకు భోజన వసతి కల్పించడంతో పాటు రవాణా చార్జీలు చెల్లిస్తామని చెప్పారు. క్రీడల్లో గెలుపు ఓటములు సర్వసాధారణమని క్రీడాస్ఫూర్తిని చాటి టోర్నీని విజయవంతం చేయాలని నిర్వాహకులు క్రీడాకారులకు విజ్ఞప్తి చేశారు.

పరిశ్రమల్లో భద్రత డొల్ల!

- అంతంతమాత్రంగానే అగ్రి ప్రమాద నివారణ చర్యలు
- వేసవి కాలం వస్తుండటంతో కార్మికుల్లో భయాందోళన



లీఫార్మా పరిశ్రమలో ఎగిసి పడుతున్న మంటలు(ఫైల్)

జిన్నారం(పటాన్‌చెరు): రసాయన పరిశ్రమల్లో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. ఎప్పుడు ఎటువైపు నుంచి అగ్ని ప్రమాదం జరుగుతుందోనని కార్మికులు బిక్కుబిక్కుమంటూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని విధులు నిర్వర్తిస్తున్నారు. భద్రత చర్యలు పాటించకుండా యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. జిల్లాలోని పారిశ్రామిక వాడల్లో తరచూ అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా కార్మిక శాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు. వేసవి కాలం వస్తుండటంతో పరిశ్రమాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- కాలంతో సంబంధం లేకుండా జిల్లా వ్యాప్తంగా ఉన్న రసాయన పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. వచ్చేది ఎండాకాలం కావటంతో పరిశ్రమల్లో ఎక్కువ ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంటుంది. జిల్లాలో సుమారు రెండు వేల వరకు వివిధ రకాల రసాయన పరిశ్రమలు ఉన్నాయి. పటాన్‌చెరుతో పాటు పాశమైలారం, బొల్లారం, ఖాజీపల్లి, గడ్డపోతారం, బొంతపల్లి పారిశ్రామిక వాడలో ఎక్కువగా రసాయన పరిశ్రమలు ఉన్నాయి.
- పరిశ్రమల యాజమాన్యాలు సరైన నిబంధనలు పాటించకపోవటం వల్ల తరచూ పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యమైన ప్లాంట్లలో నైపుణ్యం ఉన్న ఉద్యోగులు, కార్మికులను కేటాయించకపోవటం కూడా ప్రమాదాలకు ఓ కారణంగా కనిపిస్తోంది. నైపుణ్యం ఉన్న కార్మికులు, ఉద్యోగులకు ఎక్కువ జీతాలు ఇవ్వాల్సి ఉంటుందని, నిబంధనలను పాటించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో నివారణకు తగిన ఫోమ్, ఫైర్ వాహనాలను అందుబాటులో ఉంచుకోవాల్సి ఉంటుంది. దీంతో పాటు ప్రత్యేకంగా అగ్నిమాపక సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాల్సి ఉంది. ఇలాంటి చర్యలను పరిశ్రమల యాజమాన్యాలు పాటించకపోవటంతో అగ్ని ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులు మృత్యువాత పడుతున్నారు.
- ప్రమాద ఘటనలు బయటపడకుండా యాజమాన్యాలు గోప్యంగా ఉంచుతున్నాయి. ప్రమాదం జరిగిన సమయంలో యాజమాన్యాలు అత్యంత కఠినంగా వ్యవహరిస్తున్నాయి. పోలీసులకు కూడా ఘటనా స్థలానికి వెళ్లనీయకుండా చూస్తున్నారు. దీంతో జరగాల్సిన ప్రాణ, ఆస్థి నష్టం జరిగిపోతోంది.
- రసాయన పరిశ్రమల్లో తరచూ అగ్ని ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత పరిశ్రమల శాఖ అధికారులు నామమాత్రంగా చర్యలు తీసుకుంటున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో విచారణ పేరిట ఘటనా స్థలాన్ని సందర్శించి చేతులు దులుపుకుంటున్నారు. తగిన సమాచారాన్ని కూడా పరిశ్రమల శాఖ అధికారులు ఇవ్వకపోవటం గమనార్హం.

నెల రోజుల్లో మూడు ప్రమాదాలు

గడ్డపోతారం, ఖాజీపల్లి పారిశ్రామిక వాడల్లో నెల రోజుల్లో మూడు అగ్ని ప్రమాదాలు జరిగాయి. మైలాన్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ముగ్గురు కార్మికులు మృతి చెందారు. కేకులే ఫార్మా పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మరోఇద్దరు కార్మికులు గాయపడ్డారు. ఇటీవల లీఫార్మా పరిశ్రమలో జరిగిన పరిశ్రమల్లో ఇద్దరు కార్మికులకు గాయాలయ్యాయి. మంటలను ఆర్పేందుకు పరిశ్రమల్లో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులే వారి ప్రాణాలను ఫణంగా పెట్టి మంటలను ఆర్పుతున్నారు. ఈ సమయంలో కార్మికులకు కూడా మృత్యువాత పడుతున్నారు.

ఎండాకాలం.. తస్మాత్ జాగ్రత్త

ఎండాకాలం కావడంతో రసాయన పరిశ్రమల్లో యాజమాన్యాలు అనేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. వేసవి కాలంలో రసాయనాల మధ్య తీవ్ర ఒత్తిడి పెరిగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. యాజమాన్యాలు ముందస్తుగా అగ్ని ప్రమాదాల నివారణకు అనేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. లేని పక్షంలో మరిన్ని అగ్ని ప్రమాదాలు జరిగి ఆస్తి, ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉందని కార్మికులు వాపోతున్నారు.

ఎప్పటికప్పుడు స్పందిస్తున్నాం

పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా ఎప్పటికప్పుడు యాజమాన్యాలకు తగిన సూచనలు, సలహాలు చేస్తూనే ఉన్నాం. ప్రమాదం జరిగిన సమయంలో పరిశ్రమలను సందర్శించి యాజమాన్యాలపై కేసులు నమోదు చేస్తున్నాం.

– ప్రవీణ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారి

క్లుప్తంగా

విద్యాపీఠం సందర్శన



పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే దంపతులు

నారాయణఖేడ్: సంగారెడ్డి సమీపంలోని పసల్వాదిలోని శ్రీజ్యోతిర్మస్తు విద్యాపీఠాన్ని ఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, జయశ్రీరెడ్డి దంపతులు శనివారం దర్శించుకున్నారు. మహాశివ రాత్రి ఉత్సవాల్లో భాగంగా కొనసాగుతున్న సైకత లింగార్చనలో పాల్గొన్నారు. విద్యాపీఠం పీఠాధిపతి డాక్టర్ బ్రహ్మర్షి మహేశ్వర సిద్ధాంతిని కలుసుకున్నారు మహాశివరాత్రి ప్రత్యేక పూజలకు సిద్ధాంతి ఎమ్మెల్యే దంపతులను ఆహ్వానించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

పటాన్‌చెరుటౌన్: వాహనం ఢీకొనడంతో పాదచారి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రసాద్‌రావు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ క్రాస్ రోడ్‌లోని బాలాజీ ఎలక్ట్రికల్ యూ టర్న్ వద్ద శనివారం రోడ్డు దాటుతున్న పాదచారిని సంగారెడ్డి వెళ్తున్న ఓ టిప్పర్ ఢీ కొట్టింది. దీంతో అతడి రెండు కాళ్లు విరిగిపోయాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని 108 అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు చిరంజీవి(25)గా పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని శవపరీక్ష కోసం తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడి సంబంధీకులు పటాన్‌చెరు పోలీసులను సంప్రదించాలన్నారు.

శాస్త్రీయ విద్యపై చిన్న చూపు

- సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేసినా పరికరాలు కరువు
- కార్యాలయాలుగా ల్యాబ్‌ల వినియోగం
- పట్టించుకోని విద్యాశాఖ
- నష్టపోతున్న విద్యార్థులు



ముస్లాపూర్‌లో నిర్మించిన సైన్స్‌ల్యాబ్



తుప్పు పట్టిన పదేళ్లనాటి పరికరాలు

అల్లాదుర్గం(మెదక్): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు శాస్త్రీయ విద్యకు దూరమవుతున్నారు. ప్రభుత్వం పాఠశాలలకు సైన్స్ పరికరాలు, సామగ్రితో పాటు నిధులు సైతం మంజూరు చేయడం లేదు. ల్యాబ్ కోసం ప్రత్యేక భవన నిర్మాణానికి లక్షలు మంజూరు చేసింది. జిల్లాలో కొన్ని పాఠశాలలను మాత్రమే ఎంపిక చేసి భవనాలు నిర్మించారు. ఏడాదిగా ఆ భవనాలను కార్యాలయాలకు వాడుకుంటున్నారు. సైన్స్ ల్యాబ్ పరికరాలు, సామగ్రిని విద్యాశాఖ అందివ్వకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది.

- జిల్లాలో 147 జిల్లా పరిషత్ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో కేవలం 20 పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం 2019–20లో సైన్స్ ల్యాబ్ భవనాల నిర్మాణాలకు రూ.9 లక్షలు మంజూరు చేసింది.
- హవేలిఘనపూర్ మండలంలో మూడు జెడ్పీ పాఠశాలలు, మెదక్‌లో 2, నిజాంపేట 1, రామాయంపేట 2, అల్లాదుర్గం 1, చిలిపిచెడ్ 1, టేక్మాల్ 2, చేగుంట 2, కొడిపల్లి 1, నర్సాపూర్ 1, శివ్వంపేట 2, వెల్దుర్తి 3 పాఠశాలలకు భవనాలు మంజూరు కాగా ఏడాది క్రితం భవనాలు నిర్మించారు.
- మరో 127 జెడ్పీ పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లు లేవు. కొన్ని మండలాల్లో రెండు, మూడు సైన్స్ భవనాలు మంజూరైతే, మరి కొన్ని మండలాలకు మంజూరు కాలేదు.
- ఏళ్ల తరబడి గ్రామీణ విద్యార్థులకు ప్రయోగశాలంటే తెలియని పరిస్థితి. ప్రతీ పాఠశాలలో ప్రయోగశాలలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.
- రూ.9 లక్షలతో సైన్స్ ల్యాబ్‌లకు భవనాలు నిర్మించినా, వాటిని కార్యాలయాలుగా వాడుకుంటున్నారు. గతంలో దశాబ్దాల క్రితం మంజూరైన సామగ్రిని పాఠశాల సైన్స్ టీచర్లు అందులో పెట్టడం లేదు. పాత సామగ్రి బీరువాలు, అల్మారాల్లో భద్రపరిచారు. అవి తుప్పు పట్టి పనికిరాకుండాపోయాయి.

బోధనతోనే సరి

ప్రభుత్వ పాఠశాలలో శాస్త్రీయ విద్యా బోధనపై నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోసైన్స్ సబ్జక్టులకు సరైన ల్యాబ్ సౌకర్యం లేక బోధనతోనే సరిపెడుతున్నారు. ఏడాది క్రితం సైన్స్ ల్యాబ్‌కు సంబంధించి భవనాలు నిర్మించినా సామగ్రి, పరికరాలు మాత్రం ప్రభుత్వం సరఫరా చేయలేదు. రూ.9 లక్షలతో భవనాలు నిర్మించినా కేవలం రూ.3 లక్షలు మంజూరు చేస్తే సామగ్రి, ఇతర పరికరాలు కొనుగోలు చేయవచ్చని సైన్స్ టీచర్లు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు సైన్స్ సామగ్రి, పరికరాలు మంజూరు చేయాల్సిన అవసరం ఉంది.

పరికరాలు ఇవ్వలేదు



సైన్స్ ల్యాబ్ కోసం భవనం నిర్మించారు. ఇది నిర్మించి ఏడాది గడిచింది. ల్యాబ్ సామగ్రి, పరికరాలు మాత్రం ఇవ్వలేదు. ల్యాబ్‌లో ప్రయోగాలు చేసేందుకు పరికరాలు అవసరం. కొంత మేరకు మాత్రమే సరఫరా చేస్తే ల్యాబ్ ఏర్పాటుచేసినా వృథాయే.
– సమత, విద్యార్థిని, ముస్లాపూర్ జెడ్పీ పాఠశాల

సైన్స్‌పై నిర్లక్ష్యం



ప్రభుత్వం సైన్స్‌పై నిర్లక్ష్యం వహిస్తుంది. మాకు ప్రయోగాలంటే తెలియదు. ప్రభుత్వం స్పందించి శాస్త్రీయ విద్యనందించేందుకు చర్యలు తీసుకోవాలి. ప్రతీ పాఠశాలలో సైన్స్ ల్యాబ్ సౌకర్యం కల్పించి శాస్త్రీయ విద్యను మెరుగుపర్చాలి.
– భానుతేజ, విద్యార్థి, ముస్లాపూర్

ప్రత్యేక నిధులు ఇవ్వాలి



ప్రభుత్వం శాస్త్రీయ విద్యను అందించేందుకు కృషి చేయాలి. ప్రత్యేక భవనాలు నిర్మించడంతో పాటు, ఏటా ప్రత్యేక నిధులు మంజూరు చేయాలి. ప్రయోగాలతో విద్యార్థులకు బోధించడం జరుగుతుంది. సరైన పరికరాలు లేక ప్రయోగాలు చేయించలేకపోతున్నాం.
– శ్రీకాంత్, సైన్స్‌టీచర్, ముస్లాపూర్


కుక్కల దాడిలో 12 గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

మద్దూరు(హుస్నాబాద్): కుక్కల దాడిలో 12 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. బాధిత రైతు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దూల్మిట్ట మండలంలోని బెక్కల్ గ్రామానికి చెందిన చౌదరి దశరథంకు గొర్రెలు పెంచుతున్నాడు. శుక్రవారం సాయంత్రం వరకు గొర్రెలను మేపి అనంతరం వాటిని పశువుల పాకలోకి తోలాడు. శనివారం ఉదయం వచ్చి చూసే సరికి 12 గొర్రెలు మృతి చెందగా, మరికొన్ని తీవ్రంగా గాయపడినట్లు గుర్తించాడు. గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

12 మందికి కోవిడ్ టెస్టులు



పటాన్‌చెరుటౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయిం శనివారం 12 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగిటివ్ వచ్చినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. అదే విధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు పది మందికి నిర్వహించినట్లు చెప్పారు.

బైక్ ను ఢీ కొట్టిన లారీ

- భార్యాభర్తలకు తీవ్రగాయాలు
- ఒకరి పరిస్థితి విషమం





గాయపడిన భార్యాభర్తలు

హత్నూర(సంగారెడ్డి): లారీ ఢీ కొన్న ఘటనలో భార్యాభర్తలకు తీవ్రగాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఎస్‌ఐ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా కొడిపల్లి మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన ఊట్ల శ్రీకాంత్, అర్చన భార్యాభర్తలు. శుక్రవారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లారు. శనివారం స్వగ్రామమైన మెదక్ జిల్లా వెంకట్రావ్ పెట గ్రామానికి పల్సర్ బైక్ పై బయలుదేరారు. దౌల్తాబాద్ లోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఉన్న స్పీడ్ బ్రేకర్ ఉండటంతో శ్రీకాంత్ బైక్‌ను స్లో చేశాడు. ఈ క్రమంలో వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ ఒక్కసారిగా బలంగా ఢీ కొట్టింది. దీంతో భార్యాభర్తలిద్దరూ కింద పడిపోయారు. వారిద్దరినీ లారీ కొద్ది దూరం ఈడ్చుకెళ్లింది. లారీ టైర్ల కింద ఇరుక్కుపోయిన వారిని స్థానికులు అతి కష్టం మీద బయటకు తీశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ వారిని పోలీసు వాహనంలో నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు.

మృతుడు అహ్మదీపూర్ వాసిగా గుర్తింపు



వెంకటేశం (ఫైల్)

తొగుట(దుబ్బాక): మల్లన్న సాగర్ రిజర్వాయర్‌లో శుక్రవారం లభించిన మృతదేహం గజ్వేల్ మండలంలోని అహ్మదీపూర్ వాసిగా గుర్తించినట్టు తొగుట ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మల్లన్న సాగర్ రిజర్వాయర్‌లో తుక్కాపూర్ శివారులోని గుట్టల వైపుకు ఓ మృతదేహం నీటిలో కొట్టుకొచ్చింది. దీంతో తుక్కాపూర్ గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహంపై ఉన్న దుస్తులు ఆధారంగా కేసునమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతుడి ఫొటో సోషల్ మీడియాలో పోస్టుచేయడంతో అతడి కుటుంబీకులు గుర్తించారు. మృతుడు అహ్మదీపూర్‌కు చెందిన వడ్ల వెంకటేశం (40)గా గుర్తించారు. శనివారం అతడి అన్న వడ్ల రాములు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించి, దుస్తుల ఆధారంగా మృతదేహం తన తమ్ముడిదేనని చెప్పాడు. మతి స్థిమితం లేకపోవడంతో గతంలో రెండు సార్లు ఇంటి నుండి చెప్పకుండా వెళ్లిపోయాడు. అదేవిధంగా 2023 సెప్టెంబర్ 13వ తేదీ నుంచి అతడి ఆచూకీ తెలియకుండా పోవడంతో గజ్వేల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్‌ఐ వివరించారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు శనివారం జరిమానా విధించింది. సిద్దిపేట పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీఓ కార్యాలయ చౌరస్తా, రాజీవ్ రహదారిపై సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ వాహనాల తనిఖీ చేపట్టారు. మొత్తం పది మంది పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ చేసిన న్యాయమూర్తి రమేశ్‌బాబు రూ.21 వేల జరిమానా విధించారు.

నారాయణఖేడ్: గత కొద్దిరోజులుగా పట్టణంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ 73మంది పట్టుబడ్డారు. వారిని శనివారం నారాయణఖేడ్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచారు. వారికి న్యాయమూర్తి ప్రియాంక సిరిసిల్లా రూ.80 వేల జరిమానా విధించారని ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. రెండోమారు పట్టుబడితే జైలు శిక్ష విధిస్తామన్నారు. లోక్‌అదాలత్‌లో 431 కేసులను పరిష్కరించారు.

పారిశ్రామిక అభివృద్ధిపై మాట్లాడటం సిగ్గుచేటు

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి

పటాన్‌చెరుటౌన్: అసెంబ్లీలో మంత్రి కేటీఆర్ అమీన్‌పూర్ పరిధిలోని సుల్తాన్‌పూర్ పారిశ్రామిక అభివృద్ధిపై మాట్లాడటం సిగ్గు చేటు అని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. శనివారం పటాన్‌చెరు పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2004లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఓఆర్‌ఆర్‌ను పటాన్‌చెరు నియోజకవర్గంలో సుమారు 30 కిలోమీటర్లు విస్తరించడంతో లక్షల్లో ఉన్న భూములు కోట్లలోకి చేరాయన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో బీడీఎల్, బీహెచ్‌ఈఎల్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ పరిశ్రమలు నెలకొలిపి వేలాది మందికి ఉపాధి కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి భూములు వేలం వేయడం తప్పా, పరిశ్రామిక అభివృద్ధి చేయడం రాదని మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, నాయకులు రాజు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలు పొందిన విద్యార్థులు

జహీరాబాద్: తెలంగాణ అకాడమిక్ ఫర్ స్కిల్స్ అండ్ నాలెడ్జి సంస్థ(టాస్క్) ఆధ్వర్యంలో సంగారెడ్డిలో నిర్వహించిన జాబ్ మేళాలో పాల్గొన్న జహీరాబాద్ విద్యార్థులు ప్రతిభ చాటారు. జహీరాబాద్ ఆచార్య డిగ్రీ కళాశాలకు చెందిన 25 మంది విద్యార్థులు పలు సంస్థల్లో ఉద్యోగాలు పొందినట్లు ప్రిన్సిపాల్ సీహెచ్.హరికుమార్ తెలిపారు. ఈ మేరకు ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు సాధించేందుకు తమ వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టాస్క్ కోఆర్డినేటర్ ముత్యం కుమార్, కళాశాల కోఆర్డినేటర్ నర్సింహులు, డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, అధ్యాపకులు రామచంద్రం, నందు, దత్తు, రమేశ్, నిఖిత, లావణ్య ఇస్రత్ ఫాతిమా, స్వేత, ఉద్యోగాలు పొందిన విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి



కనకవ్వ మృతదేహం

బెజ్జంకి(సిద్దిపేట): పక్షవాతంతో బాధపడుతున్న భర్త, మానసిక వైకల్యంగల కూతురుకి సేవలు చేస్తూ జీవితంపై విరక్తితో మహిళ పురుగుల మందు తాగింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రేగులపల్లె గ్రామానికి చెందిన మాతంగి దుర్గయ్య, కనకవ్వ దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. దుర్గయ్యకు పదేళ్ల క్రితం పక్షపాతం వచ్చి మంచానికే పరిమితమయ్యాడు. చిన్న కూతురు సునీత మానసిక స్థితి సరిగా లేదు. కుమారుడు మాతంగి శశిధర్ హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. భర్త, కూతురుకు సేవలు చేస్తూ మానోవేదనకుగురైంది. జీవితంపై విరక్తి చెంది శుక్రవారం క్రిమిసంహారకమందు తాగింది. గమనించిన బంధువులు చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రి, తరువాత నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ యూనిస్ తెలిపారు.

బావిలోపడి యువకుడు..

ఝరాసంగం(జహీరాబాద్): ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని ఈదులపల్లి గ్రామానికి చెందిన మహేశ్ (28) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం సాయంత్రం బావిలో పడి మృతి చెందాడు స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని బావి నుండి తీసి జహీరాబాద్ ఆస్పత్రికి తరలించారు. వివరాలు తెలియాల్సి ఉంది.

దశదిన కర్మకు వెళ్లి.. చెరువులో శవమై



నరేశ్ (ఫైల్)

దుబ్బాక రూరల్: దశదిన కర్మకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని గంభీర్‌పూర్ గ్రామంలో శనివారం జరిగింది. సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ మహేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మిద్దె నరేశ్(36) తన బంధువు తోర్నాల సంజీవు ఇటీవల మృతి చెందాడు. అతడి దశదిన కర్మ కావడంతో బంధువులు, కుటుంబ సభ్యులు స్నానాలు చేయడానికి గ్రామ శివారు చెరువుకు వెళ్లారు. స్నానం చేసేందుకు చెరువులోకి దిగాడు. ప్రమాద వశాత్తు కాలుజారి నీటమునిగి నరేశ్ మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. మృతుడి భార్య కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

హాఫ్ మారథాన్‌ను జయప్రదం చేయండి



మారథాన్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్ తదితరులు

అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్

హుస్నాబాద్: పోలీస్ శాఖ, హుస్నాబాద్ రన్నర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం హాఫ్ మారథాన్ రన్నింగ్ పోటీలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను శనివారం అడిషనల్ డీసీపీ అడ్మిన్ ఎస్.మహేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాఫ్ మారథాన్ నిర్వహణపై పలు సూచనలు చేశారు. హాఫ్ మారథాన్‌లో పాల్గొనే యువతీ యువకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

❖ ట్రాఫిక్ ఆంక్షలు

హుస్నాబాద్ పట్టణంలో నిర్వహించే హాఫ్ మారథాన్ సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు సీఐ ఎర్రల కిరణ్ తెలిపారు. 5కె రన్ ఏనే వద్ద ప్రారంభమై అంబేడ్కర్ చౌరస్తా, నాగారం రోడ్ చౌరస్తా, ప్రభుత్వ ఆస్పత్రి బైపాస్, గాంధీ చౌరస్తా, బస్ డిపో, అనబేరి విగ్రహం, మల్లెచెట్టు చౌరస్తా మీదుగా తిరిగి ఏనే వద్ద ముగుస్తుందన్నారు. అలాగే 10కె రన్ ఏనే వద్ద ప్రారంభమై చౌటపల్లి క్రాసింగ్ వరకు తిరిగి ఏనే వద్ద ముగుస్తుందని తెలిపారు. 21కె రన్ ఏనే వద్ద ప్రారంభమై అక్కన్నపేట వరకు వెళ్లి తిరిగి ఏనే వద్ద ముగుస్తుందన్నారు. హుస్నాబాద్ పట్టణం, అక్కన్నపేట రూట్లలో ఉదయం 6 గంటల నుంచి 8 వరకు ట్రాఫిక్ నిలిపివేయబడుతుందని, ఇందుకు ప్రయాణికులు, ప్రజలు సహకరించాలని సీఐ కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ ఫణిందర్, హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, సీఐ కిరణ్, స్పెషల్ బ్రాంచ్ సీఐ రఘుపతి రెడ్డి, ఎస్‌ఐలు మహేశ్, వివేక్, హుస్నాబాద్ రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేశ్, ఉపాధ్యక్షుడు సంపత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుతో అధిక దిగుబడి



హుస్నాబాద్ శివారులో కోళ్ల ఎరువును పొలంలో చల్లేందుకు సిద్ధంగా ఉంచిన రైతు

- పొలాల్లో చల్లేందుకు ఆసక్తి చూపుతున్న రైతులు
- బస్తా రూ. 700 ల వరకు కొనుగోలు
- కోళ్ల ఎరువు కోసం ముందస్తు చెల్లింపు

మునిపల్లి(అందోల్): రసాయన ఎరువుల ధరలు ఆకాశనంటడంతో సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. వివిధ రకాల పంటలు సాగే చేసేవారు అధిక దిగుబడి సాధించేందుకు పశువుల ఎరువులు, కోళ్ల ఎరువులను కొనుగోలు చేస్తున్నారు. దీంతో మేకల, గొర్రె, కోళ్ల ఎరువులకు డిమాండ్ పెరిగింది. కోళ్ల ఎరువులు కొద్ది పాటి చినుకులు పడినా భూమిలో కలిసి పోతుంది. కోళ్ల ఎరువులతో పంట అధిక దిగుబడి సాధించవచ్చని అధికారులు చెబుతున్నారు. ఈ ఎరువులు సకాలంలో దొరక్కపోవడంతో కొంత మంది రైతులు రసాయన ఎరువులపై ఆధారపడుతున్నారు. దీంతో గత ఆరేళ్లుగా రసాయన ఎరువుల వాడకం రెండింతలు పెరిగింది. పది ఇలోల కోళ్ల ఎరువు బస్తా రూ. 400 నుంచి 700లకు కొనుగోలు చేస్తున్నారు. ఇంత ధర ఉందంటే రైతులు ఎంత వినియోగిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. కొందరు రైతులు కోళ్ల ఫారాల యజమానులకు ఎరువు కోసం అడ్వాన్స్ ఇస్తున్నట్లు చెబుతున్నారు.

భూమిలో కలిసిపోతుంది



కోళ్ల ఎరువు పొలంలో త్వరగా కలిసిపోతుంది. దీంతో పంట అధిక దిగుబడి వస్తుంది. అంతే కాకుండా కోళ్ల ఎరువు తక్కువ ధరకు దొరుకుతుంది. కోళ్ల ఫారాల యజమానులకు ఎరువుల కోసం ముందే అడ్వాన్సు ఇస్తాం.
– బోయిని విఠల్, రైతు

భూసారం పెంపు



సేంద్రియ ఎరువులతోనే పంట అధిక దిగుబడి సాధించి అధిక లాభాలు సాధించే అవకాశం ఉంటుంది. రసాయన ఎరువులతో భూమి, పంట దెబ్బతినడమే కాకుండా పంట దిగుబడి అంతంత మాత్రంగానే వస్తుంది.
– నర్సింగ్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి